

# మినీకథావీధి

## చర్మవ్యాధుడు



హేమ శేఖర్

ఆశించిన ప్రసాదం అందకపోయినప్పటికీ, భక్త ప్రపంచం నుంచి బయట పడిన మాకు తృప్తిగానే వుంది. అనుకున్న మేరకు అన్నీ సవ్యంగానే జరుగుతున్నాయి. ఆచారం ప్రకారం ఓ అరుగుపై కూర్చున్నా మిద్దరం, కర్చీఫ్ పరచి. కొబ్బరి తింటూ, ఆలయంలోకి వచ్చే పోయే అందాల్ని వదలకుండా చూస్తున్నాము. చేతిలో మిగిలిన పూలను, కొద్ది కొబ్బరిని ఓ ఫామిలీ గ్రూపు పాపను పిలిచి యిచ్చాడు మా మిత్రుడు.

మా ముందువైపు, అంతకు ముందే నిలబడిన కార్లోంచి దిగుతున్న మాగ్నెట్‌ని చూస్తూ 'డ్రస్ చూడరా, ఎంత బాగుందో' నని మెచ్చుకుంటూ, వాడి చేతిలోవున్న నా చేతిని నలుపుతూ క్రిందనున్న కొంచెం ఎతు రాతికేసి కాలును పొరపాటున కొట్టాడేమో, కుడికాలు చెప్పు తెగిపోయింది. ఆ సమయంలో అక్కడ వాడి మనసుపడిన బాధ చెప్పనలవికాదు. వాడికేదో మంత్ర మహిమే ఉంటే పరులకు తను కన్పించకుండా చెప్పెత్తుకు పరుగెత్తుకు పోయేవాడేమో.

ఆ ఆపదలో వాణ్ని ఆదుకోక ఆప్త మిత్రుడనే పట్టాను కోల్పోయానేమోనన్పించింది నాకు. వాడి మొహం జేగురించింది. ఓ చిన్న గత స్మృతి కళ్ళల్లో మెదిలింది నాకు. ఇలాగే బజార్లో చెప్పుతెగిపోయిన అమ్మాయి, తన ఫ్రెండ్ వానిటీ బ్యాగ్‌లో చెప్పులను దాచి నడిచింది ఓ రోజు. అలాంటి వానిటీ బ్యాగ్ కాని, వాటికి సంబంధించింది కాని నా దగ్గర లేక పోగా, కనీసం వాడి దగ్గరైనా లేదు. చెప్పును యథాతథంగా వేసుకుని నెమ్మదిగా కాళ్ళీడ్చుకొంటూ నడుస్తూ అమాయకుడిలా కాళ్ళ మధ్య నేలను చూస్తున్నాడు. మధ్యలో నాకేసి విషపు నవ్వులు నవ్వుతున్నాడు. ఎదురుపడిన ఫ్రెండ్స్‌ని కనీసం 'హలో' అనయినా అనకుండా వెళ్తున్నాడు. వీడి బాధను గమనించినవాళ్ళు జాలి చూపి పలకరించలేదు. చివరకు చూస్తున్న భిక్షగాళ్లు కూడా వాణ్ణి వదలి నన్ను పట్టుకొన్నారు. ఉన్న చిల్లర డబ్బులు కాస్త ఖాళీ

ఎలాగో ప్రక్క స్ట్రీట్‌లోని చెప్పులు కుట్టే వాడిదగ్గరకు చేరాము. ఎవరెస్టు శిఖరాన్నెక్కినంత ఆనంద మయిపోయింది వాడికి ఆ సమయంలో! ఓ ఫస్టు క్లాస్ స్టూడెంట్‌లా మెరిసిపోయింది వాడిముఖం. వాడి ఆనందాన్ని చూస్తున్న నేనూ ఆనంద పడిపోయాను. కొద్ది దూరంలో వస్తున్న మమ్మల్నే గమనిస్తున్న చెప్పుల వాడు, పరికరాలకు పదును పెట్టడం గమనించాను.

చెప్పుల వాడికి గిరాకీ లేకుండా ఉందప్పుడు. చెప్పును చేతిలోకి తీసుకొని పరిశీలిస్తూ మా యిద్దరి ముఖాలూ చూశాడు.

"ఎంతవుతుంది?" అడిగాడు మా మిత్రుడు ఘాటుగా.

"యాభై పైసలివ్వుబాబూ!" అదేనేమో అతడు చేయవలసినపనికి గిట్టుబాటు ధర.

"యాభై పైసలు లేదు ఏమీలేదు.... ఇరవై పైసలిస్తాను. అంతే...."

చెప్పులతడు నెమ్మదిగా తలెత్తి మొదట వాడివైపు, తర్వాత నావైపుచూసి ఓ రకంగా నవ్వి మేమొచ్చినదారి వైపోసారి చూసి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

నాకెందుకో అనుమానమొచ్చి ఆ దారి వైపు చూశాను. ఏమీ కన్పించలేదు. అతడు చేస్తున్న ఆ పనివైపుచూస్తున్నాను.

"ధర్మ దర్శనమా? స్పెషల్ దర్శనమా? బాబూ" అడిగాడు అదో విధంగా తల పైకెత్తకుండా.

"కాలేజీ సూడెంట్సుకి ధర్మదర్శనమంటూ ఒకటుందా?" ప్రశ్నించింది కాలేజి కుర్రాళ్ళ గర్వం, మావాడిలో తొంగి చూస్తూ.

"టెంకాయ కొట్టారా బాబూ?" అడిగాడతడు.

"గుడికెళ్ళి టెంకాయ కొట్టకుండా రావడమా?" మావాడి దైవభక్తి గర్జించింది.

"కొందరు కొట్టరుగా బాబూ! అందుకని అడిగాను."

కర్చీఫ్‌తో ముఖాన్ని తుడుచుకున్నాను. పెట్టుకున్న కుంకుమ చెరిగిపోయింది.

"హి సీమ్స్ లెక్ యాన్ ఇన్నోసెంట్ కంట్రీమాన్" అన్నాడు మావాడు. నేను మౌనంగా ఉన్నాను. అతడు విని మళ్ళీ పనిలో నిమగ్నుడయ్యాడు.

"హుండీలో ఎంతేశారు బాబూ" తల

పైకెత్తకుండా పనిచేస్తూనే ప్రశ్నించాడతడు.

"అయిదు రూపాయలు" అతని అహంకారం జవాబిచ్చింది. ప్రక్కనున్న చిన్న డబ్బీలో చేయి చాపి చీలలు తీసుకొంటూ నెమ్మదిగా తలెత్తుతూ ఓరకంటితో మా మిత్రుడివైపు చూశాడతడు. ఒక చీలను కొడుతూ "మొత్తం ఎంత ఖర్చుపెట్టారు బాబూ దేవుడి కోసం ఈ రోజు?"

"నీకెందుకదంతా? కానీ తొందరగా, పైమయ్యింది" అతడేసిన ఆ ప్రశ్నకు మా మిత్రుడిచ్చిన జవాబులాంటి ఆదేశం. ఇంకో చీలనుకూడా చెప్పుకు కొట్టాడు మళ్ళీ తొందరగా అది తెగకుండానేమో.

"మీరెంత డబ్బును ఖర్చుపెట్టినా ఈ చెప్పును తెగకుండా ఆపలేకపోయాడు చూడండి బాబూ ఆదేవుడు" అంటూ రిపేరయిన చెప్పును మా మిత్రుడి కాళ్ళ ముందేశాడు. చిల్లర బయటకు తీసి లెక్కపెట్టిస్తే ఉందని యింకో అయిదు పైసలు ఎక్కువ అడుగుతాడేమోనని కాబోలు ఇరవై పైసలు జేబులోనే తీయాలని ఉబలాటపడుతున్న మా మిత్రుడు ఆ మాటలు పటించుకోనట్లే. ఒక పదిపైసలు, రెండు అయిదుపైసల నాణాలను తీసి అతడిచేతిలో వేశాడు.

ఆ మూడు నాణాలను ఒకదాని తర్వాత ఒకదానిని అరచేతిలోనే జరుపుకొంటూ అతడేదో సణుక్కొన్నాడు.

మా మిత్రుడు రెట్టించిన ఉత్సాహంతో దూసుకుపోతున్నాడు. నేను నిట్టూర్చాను.

# పూర్ ఫెలోస్



'అమంతా'

'గర్ల్స్' వెయిటింగ్ రూమ్ బిలబిలమంటూవుంది. కబుర్లు, కేరింతలూ, నవ్వులూ, అరుపులూ విచిత్రంగా వినిపిస్తున్నాయి. కాలేజీ బ్యూటీ సుజాత తన చుట్టూ మిగతా ఫ్రెండ్సును పెట్టుకొని హుషారుగా మాట్లాడుతోంది. శారద మాత్రం చాల ముభావంగావుంది. సుజాత చూసింది.

"ఏమిటే అలా వున్నావ్?" పరధ్యాన్నంగా వున్న శారద భుజాన్ని వూపుతూ సుజాత అడిగింది.

శారద కనురెప్పలు పైకి యెత్తింది. కళ్ళు రెపరెప లాడాయి.

కండ్లు చెమ్మగిల్లాయి. బాధగా అల్లిల్లాడాయి.

"ఏమిటే, ఏం జరిగిందే?" సుజాతే మళ్ళీ కంగారుగా అడిగింది.

"ఏంలేదు సుజాత— ఆ నీరజ చూడు— పెద్ద పోజులు కొడుతోంది." శారద సగం చెప్పి ఆగింది.

"ఎందుకే పోజు?" సుజాత తిరిగి అడిగింది.

"ఆ- యిందాక నా పెన్నులో సిరా అయిపోతే— అర్జంటుగా వుత్తరం వ్రాయవలసివుండి, దాని పెన్ను అడిగా. అది ఫారెన్ మేకట, పాడైపోతుంది యివ్వనంది." శారద చెప్పింది.

"దానికి యింత బాధ ఎందుకే?" సుజాత తేలిగ్గా తీసుకుంది ఆ విషయం.

"అదికాదే, అది అలా అన్నందుకైనా అలాంటిపెన్ను ఒకటి కొందాం అనివుంది. కానీ" మధ్యలో ఆగింది.

శారద ఆర్థిక పరిస్థితులు సుజాకి తెలుసు. శారద బాధ అర్థం చేసుకొంది.

"ఏంటే- అంత గొప్ప పెన్నా? చూద్దాం" సుజాత అంది.

"మరేనే. అధమం మూడు పాతికలైనా వుంటుందిట" శారద అంకెలని నొక్కి తన నిస్పృహని వ్యక్తంచేస్తూ చెప్పింది.

"ఆ పెన్నులు వూర్లో వున్నాయా?" సుజాత అడిగింది.

"వున్నాయట. ఫలానిచోట. శారద చెప్పింది."

"అయితే రేపు ఆదివారంనాటికి నీకు ఒకటి యిస్తా- చాలా" అంది సుజాత.

"నాకూ- నాకూ.." అంటూ అడిగరు మిగతా స్నేహితులు.

"ఓకే! అందరికీ తలా ఒకటి యిస్తా- నా పుటినరోజు ప్రెజెంటేషన్." సుజాత ఎనౌన్సు చేసింది.

తర్వాత దాన్ని గురించి ఎవ్వరూ సీరియస్‌గా తీసుకోలేదు అందరికీ తలా ఒక పెన్ను యివ్వాలంటే అధమం నాలుగు వందలు కావాలి. సరోజ నాన్నగారు పైరాబడి వచ్చే ఉద్యోగంలోలేరు- ఏదో జోక్ చేసిందనుకున్నారు అందరూ.

మర్నాడు, కాలేజీ నోటీసు బోర్డులోని నోటీసును కాలేజీ హీరోలందరూ చూసుకున్నారు. చూసుకోవడమేగాదు, జాగ్రత్తగా 'వ్రాసు'కున్నారు. ఎన్నడూ లేని యింపార్టెన్సును, నోటీసు బోర్డు ఆరోజు సంపాదించింది.

ఆదివారం సాయంత్రం సుజాత తన యింటి దగ్గర స్నేహితురాళ్ళందరికి బర్త్‌డే పార్టీ యిచ్చింది. సరదాగా గడిచింది కాలం. పార్టీ అయింది- సరోజ లోపలికి వెళ్ళి, శారదకీ, మిగతా నల్గురికీ తలో ఫారెన్ పెన్నూ ప్రెజెంటేషన్ యిచ్చింది. అన్నీ ఒకే రంగులో, ఒకే మోడల్‌గావున్న ఫారెన్ పెన్నులు- నీరజ పెన్నుకన్నా చాల బాగున్నాయి. హాస్యాని కని అనుకున్న ప్రామిస్, 'నిజంగా' మారేటప్పటికి, అందరూ ఆశ్చర్యపోయారు.

"మాకోసం యింత డబ్బు ఖర్చుపెట్టావా?" అందరూ ఒకేసారి అడిగారు.

కాలేజీ బ్యూటీ సుజాత నవ్వింది. పెద్దగా నవ్వింది, ఇంకా నవ్వింది.

ఎవరికీ ఏదీ అర్థం కాలేదు.

"నేను డబ్బు ఖర్చు పెట్టానా? ఎవరు చెప్పారే" అంది సుజాత.

మరి సుజాతకు ఆ పెన్నులు ఎలా వచ్చాయో మిగతావాళ్ళకి అర్థంకాలేదు.

సుజాత నవ్వుతోనేవుంది. చాలసేపటికి నవ్వు ఆగింది.

"శారదా నేను పెన్నులు కొనలేదే. కానీ కొనని పెన్ను పోయిందనీ, దొరికినవారు తిరిగి తనకు యివ్వవలసినదిగా ఈ కాలేజీ బ్యూటీ సుజాత నోటీసుబోర్డులో నోటీసు పెట్టించగానే కాలేజీ హీరోలు శ్యామ్, రవీ, కిరణ్, అప్పారావూ, సుబ్బారావు వగయిరాలు తలాఒక పెన్నుకొని, ఒకరికి తెలవకుండా ఒకళ్ళు, దొరికినట్లుగా నాకు యిచ్చారు. మొత్తం పది పెన్నులు వచ్చాయి మీకిచ్చిన అయిదు పెన్నులుగాక, యింకా అయిదు మిగిలాయి. పాపం! పూర్ ఫెలోస్- వాళ్ళకి నా థేంక్స్-" సుజాత చెప్పింది నవ్వు ఆపుకుంటూ. అందరూ ఒక్కసారి గొల్లుమని నవ్వారు.